కనకజానకి

పక్కలో కూర్చుని చక్కలిగింతలతో నిదుర మెలుకువ తెప్పించినది :- 'పగలు…నిదుర…' నా నిదుర కలత చూసి పకాలు మన్నది…'పనికి…చెరుపంటారు…పెద్దలు–' చెక్కిలి నొక్కుకుపోతూంది : లేచి కూర్చున్నాను, మత్తు విదిలించుకుంటూ–

'రేపు ఉదయానికి తిరిగి ఆఫీసుకు జేరుకోవాలా… రాత్రంతా ఇహ…బండి కుదింపులో నిదుర లేక'

'పక్కను నేనూ లేక…'

విరుచుకుంటూన్న, ఒళ్ళు ఆపాళాన ఆపి కొంచెం చిరాకుగా ఎకసెక్కెం పనికిరాదనే అదమాయింపుతో ఏమిటీ వాలకం ? అనే ప్రశ్న, చూశాను.

'ఇంకా మీకు నిదురే?' నేను రెప్పలు భూకుడుగా అల్లార్చాను.

'మేలుకున్నా ఇంకా కలలే'-పాఠం చెపుతున్నట్టుగా నన్ను పసివాడిక్రింద కట్టిన శోణకని బెణకని తీవి చూసిచూసి ముందుకు వచ్చేసింది.

'నీవు అంటూన్నది ఏమిటో తెలుసునా' గదమాయింపులూ కోపం దాచుకోలేకపోయినాను.

'ఆహా మరి, మీరు అనుకుంటూన్నదీ తెలుసు.'

నా మొగం రమారమి కందగడ్డ అవుతూన్నది. ఆమెకు ఏమీ, చీమ కుట్టినట్టుగానన్నా లేదు.

'అన్నీ అబద్ధాలు.'

'అవును. మీరు ఆడినవి, అనుకున్నవి.'

నాకు వింటూన్నకొద్దీ తామసం ముంచెత్తుకువచ్చి జవాబు చెప్పడానికి నోటమాట పెగలలేదు.

—ఆమె నోరు చేసుకుంది.

'అవును ముమ్మాటికీ మీరు నన్ను విడిచి బ్రతుకలేరు. నేను లేనిది ఇక మీ జీవితం ఎడారి: నేను ఉంటే బ్రదుకంతా బంగారుపంట - మూడునాళ్ళ ముచ్చటలో మనము మురిసిపోయిం దెంత? ఎన్ని అబద్ధాలు! ఎంత ముందు చూపున్నదండీ మీకు?'

"అలాగే?"

'మరి, యీలాగా కూడాను: పట్నవాసం నుంచి బంగారుతండ్రి పల్లెటూరు పావనంచేయడానికి దయచేయగానే

పడుచైవతే ఊరకుంటుంది? ఊరుకోని వయసుగత్తె ఆసామి పంట పండించేందుకు ఎండ రెన్ననినా, హద్దుమీరకుండా ఎలా ఉంటుంది: ఎవరిమాటో కాదు. నే ననేది, నన్నే: ఏంచేశాను, మీరు వస్తూన్నారనగానే ఎవరో ఎలా ఉంటారో ఆలాటివా రవునో కాదో కాకపోయినా అదెంతపని మన చేతిలో దేకదా, అని ఎన్నెన్ని ఆలోచనలకు పోయినాను. ఎప్పుడు వస్తారో అని ఎదురు చూశాను. రాగానే పనిగా మీకంటబడి చూసి కవ్వించాను. తలుపుచాటున నిలుచుని మీరు చూడకుండా చూసిచూసి, తలవూచాను. బిడియం విడిచి పిలచాను; అవునా?'

'నా కంత గర్వం లేదు.'

'లేకపోతే తెచ్చుకోండి, నన్నుచూసి అయినా నేర్చుకోండి. నాకు నేను అందగత్తెనని ఎంత గర్వమనుకున్నారు? అందానికి కాని. ఐశ్వర్యానికి కాని నా కాలిగోరికి సరిపోయే వారు, ఈ ఊరిలో ఎవరున్నారు?'

'అవును, ఉండరు.'

'ఒకవేళ ఉంటే, మీరు నా కోసమనే ఉండరు.'

'అది నేను ఒప్పుకోను. నీతి ప్రధానంగాని.'

"బూతుకుకూడానా? మీ బులిబుచ్చికాలు నమ్మే అంత నంగనాచిని అయితే, మీ రాడేమాటే నే పాడేపాట అయేది...అప్పుడు మీరు, మనసులో అంచనా వేసుకున్నందుకు సరిగా మూటాముల్లే కట్టుకుని రెండో కంటివాడికి తెలియకుండా యింటిలో పాపలను యింటిలోనే విడిచి, మీ

వెంటబడి, మీరు ఎక్కడికి వెళ్ళితే అక్కడకు వచ్చి తాళికట్టని తలుపుచాటు కాపురంచేస్తూ, మీరు రమ్మంటే రావడం, పొమ్మంటే పోయేచోటు లేకపోయినా పోవడం...అదేనా మీరు నేర్పే నీతి ?”

‘నీవు పొరపడుతున్నావు...నీమీద నాకు పవిత్రమైన ప్రేమ.’

‘ఒళ్లు తెలిసే మాటాడుతున్నారా...యింకా నిద్రలో కలవరింత లేనా; మీరంత పవిత్రమైన ప్రేమ ఉన్నవారని తెలిస్తే మీ ఛాయలకే నేను రాకపోదును; అదంటే నాకు అసహ్యం.’

‘ఆ-హాఁ...’

‘అవును. భార్యకు భర్తమీద, భక్తునికి భగవంతుని మీద...ఆలాటి అనురాగం పవిత్రమని అంటారేమో, అది నాకు ఏలా తెలుస్తుంది. భర్త లేడు. భర్త లేకుండా భార్యాత్వం నా నొసటను విధిగా వ్రాసిన భగవంతుడు ఉండీ లేడు.’

— చీకటి తప్పుకు వెంపరలాడే ఒప్పుల కుప్పలందరూ తెచ్చుకునే సాకే ఆమెకూ చిక్కిందని నా వెనుకటి అనుభవాలను పోల్చిచూసుకుని నాలో నేను నవ్వుకున్నాను. అది ఆమె ఏలాగో కనిపెట్టింది. మళ్లా అందుకున్నది.

‘అందుకనే మీరు అనుకుంటున్నారు. ఆ అగచాట్లే నిజమై ఎందుకూ కొరగానివాడే నిజముగా మగడైతే ఎందుకు తను మనసిచ్చినవానితో లేచిపోరాదూ అని. అంతేనా? మీరు కాదని మోరాయించబోకండి.

'నేను ఎందుకు యెవరితోనైనా లేచిపోవాలి?'...

'మీ మునసబుగారికి, మా అక్కయ్యను మొదటి మనువుకు యిచ్చారు: కాపురం లేక వయసు గడపలేక ఆమె ఆయేడే మా పాలెగానితో మరో తాలూకాలో కాపురం పెట్టింది. కడుపు ఓనాడు నిండనీయండి, నిండక పోనీయండి, కరువుదీరా మగడంటూ ఎవడో ఒకడు దొరికినదే చాలు.పదివేలనుకున్నది. దాని మానాన అది సుఖపడుతూంది. అంతకుమించిన నోములు నోయలేదు: బూతులో నీతి నిలుపుకుని ఒకడినీడనే ఒదిగి ఉంది.

'మా బావకు నన్ను కట్టబెట్టారు: మా వాళ్లు అంతా సిద్ధమే ...అల్లుడినోట శని ఉన్నదని మావాళ్ళకీ, ఊరివారికీ తెలిసినా ఆస్తిచూసి అది పరాయిగా పోకుండా, నన్ను ముందుకు త్రోశారు.

'నేను మరో - మరోదాన్నయితే తిండీతిప్పలూ తినక యేడ్చి అందరినీ యేడిపించి ఏ నూయో, గోయో చూచుకుంటానని హంగామా చేసి కొంపంతా ఓ కొలిక్కి దీసుకురావలసింది. కాని పెళ్ళిమాట వినగానే ఎగిరి గంతేసినంత సంబరపడి సైఁ అన్నాను. ఇంకా ముహూర్తం ఎన్నాళ్ళో ఉన్నా ఆవాళనుంచే అక్కయ్య నగలన్నీ పెట్టుకుని, కట్టినకోక కట్టకుండా దాని చీరలన్నీ కట్టుకుని నా అంత సిగ్గుమాలిన శిఖండి యింకొకతె లేదన్నంతగా తయారయినాను: అవును. నా దేంపోయింది? నలుగురూ నన్ను చూసి నవ్వితే, యెందుకో తెలియకపోతేనూ నేను బిడియపడటం. అయినా నవ్విన

నాపసానవతే మా పరగణాలో అన్నిటిలో సన్నుమించే దొరసాని ?

'లోకానికి జ్ఞాననేత్రాలేకాని, అవసరం వచ్చినపుడు అసలున్న కళ్లు మూసుకుపోతాయి. అది, నా వంటిదానికి యెంత ఉపకారం? అందరూ అన్యాయం అని నా పెళ్ళికి అడ్డుపడి చెరగొడితే నాకు యింత న్యాయం యెన్నటికన్నా జరగడానికి వీలుంటుందా ?

'లోకం ఏ మనుకుంటుంది, ఏం ఉంటేనేం ఏం లేక పోతేనేం. యేడుతరాలు గడచినా తరగసంత సంపద ఉంది. పిల్ల సుఖపడుతుంది. అదంటే మెసలుకునే నేర్పులేక అలా అధ్వాన్నమై పోయింది కాని. ఇది తెలివిగల బిడ్డ! ఇంతకూ దానికి అదృష్టముండి నిండిన యింట మెలగవలసిన యోగం, వ్రాసుకు వస్తూండబట్టే, ఆ పెద్దదానికి అలా పోయేకాలం వచ్చింది. ఏ దైవమో తిన్నగా చూస్తే, దానికి కడుపున రెండు కాయలు కాచి....

'నన్ను నవ్వనీయండి. ఇప్పు డాసంగతులన్నీ తలచు కుంటే ఉక్కిరి బిక్కిరిగా చక్కిలి గిలవుతూంది. నా కడుపున కాయలు కాయడం...లోకం కళ్ళు మూసుకుని, అక్కరలేని అబద్ధాలు ఆడుతుంది: దైవం తలవని తలంపై అనుకోనివికూడా నిజం చేస్తాడు. ముసలం కిసాల ఝుంచితే...ఆ మగనితో నాకు నెల మసలడం....

'ఆయన ఎన్నడూ నా జోలికి రాడు: ఎద్దల్లే పొలం పోతాడు. మునసబీతో పొద్దస్తమానమూ వేగి, మొద్దల్లే

నిద్దరపోతాడు. ఆ పోడిమే యేమిటో యెరుగని పుటక; అది అందరూ 'ఎరుగున్న దే.

'అందుకనే నేను తొలిసారి నీళ్ళోసుకున్నానని తెలియగానే ఊరు అట్టుడికినట్టుడికి పోయింది. ఎవరా ఆ రాయుడు అని ఆసామీలందరూ అంచనాలువేసి చూశారు. అంతు చిక్కలేదు. నన్ను నిలవేసి 'ఎవడే నిన్ను నిలువుదోపిడిచేసింది?' అని అడగడానకి ఎవరికీ నిబ్బరం చాలలేదు. ఇంటి ఆయనకు ఆ గొడవే పట్టించుకో నవసరము లేదు.

'లేకపోతే మానె.....మనిషైపుట్టిన తరువాత, ఆ మాత్రం అభిమానమన్నా ఉండకూడదా అంట? అబ్బె! ఆ విషయంలో ధర్మరాజు; చేతకాని మగడు ఏమో చేశాడని వెనుకటికి ఓ సామెత ఉంది. కాని అందరూ అలాంటి వాళ్ళు ఉండరు. అందులో మా మామ:—సరి నా యిల్లు బంగారంగానూ...నన్ను యిచ్చింది ఎక్కడో పరాయిచోట కాదు. సయామూ మేనమామకే అని చెపుదామని మొదట అనుకుంటూనే అది వదిలి ఎక్కడో ఎత్తుకున్నాను. అంతలో ఉందా నా తెలివి—అం, అబ్బ! నవ్వకండి. కొంటెతనంచేస్తే నామీద ఒట్టుసుమండి. వదలండి, మాటరానీయకుండాచేస్తే మీతో ఇక ఎన్నటికీ మాటాడను. అమ్మ! ఆశే. ఉహుఁ. ఎప్పుడూ మీకు అదే రంథి...అదే మా ఆయన కుంటేనా అందులో వీసపాలైనా...'

పల్లెటూరి పడుచుకు అంత ప్రౌఢతనం...అలా పలుకుతూంటే వగలై చిలికేరసాలు, నే నెలా వదలగలను, ఏనాటి

పుణ్యఫలముగానో చేజిక్కిన నిధానాన్ని? కాని ఆమె కాదు. నేను చిక్కింది బలిమితో బలవంతంగానైనా మరోమారు దక్కించుకోవాలని పెనగులాడినా ప్రయోజనం లేకుండా చేసింది. నవ్వుతూ ఏంత ఆగడమైనా చేయగలదు; నన్ను నవ్వించగలదు, కవ్వించి...

'మా మామ, అందుకుమాత్రం దేవుడివంటివాడేనండీ. ఏ మాట కామాట చెప్పాలి, ఎవరు ఎంతగా అయినా యెద్దేవా చేయనీండి: మొగంమీదనే వరుస, పరాచకంగా ఎన్నైనా అననీయండి. ఆయనకు నా విషయంలో చీమైనా కుట్టదు: మాయ లేదు. మర్మం లేదు.'

'ఇంకా పొగుడు.'

'తప్పు లేదు. లేనిది అవునంటే అది కాని: ఆయన గుణాలకేం.'

'అది తప్పు-'

'ఆలా వెక్కిరిస్తే చెంపమీద ఎరుపు చెరగనీయను. నా చేతి చురుకు రుచి తెలుసునా.'

'రుచి మరిగాను గనుకనే.'

'ఇక మరచిపోండి. ఈ రవంతసేపూ మాటకు అడ్డం రాకండి. కథ చాలా లేదుకాని మీకు వేళమించుతుంది. బుద్ధిగా మంచి బాలునివలె చెవులు దోరచేసుకుని నేను చెప్పేదంతా వింటే చివరకు ఏదో అప్పటికి నాకు తోచింది మీకు...'

'నీ దయ...'

"అలా గుర్రం దిగండి, గడుసుతనానికి పోక :—ఊం మా ఆయన లాగానే నేనూను : మనసులో ఒకటీ – మాటాడేది ఒకటీ కాదు. చెప్పేది ఏంతో చేసేదీ అంతే. నేను చిన్నప్పటినుంచీకూడా అంతే.

'ఎవ రేమనుకునిపోతారో అని చీటికీ మాటికీ వెనుదీసే ఘటాన్నే అయితే నే నీపాటికి యిలా ఉండేదాన్నా ? యింత నిభాయించుకుని వచ్చేదాన్నా ? స్తంభంచాటు రంభనుకాను. అన్నింటికీ చాలినదాన్ని గనుకనే అమ్మా నాన్నా అంకెళ్ళు నొక్కుకుని ఊరుకున్నారు: అంతకన్న 'ఏమన్నా అంటే నేనూరుకోనుగదా? అమ్మమ్మ...పళ్లువచ్చినదాన్నిగదా, ఏమన్నా అది నామీద తిరగబడవస్తుందా అని మా పాపడు పోరుపట్టి ఏడుస్తూంటే తొట్టె కదిలిస్తూ, శాణాతనంగా 'ఎవరికిపుట్టిన బిడ్డరా ఎక్కెక్కి ఏడుస్తూంది అని అక్కసు వెళ్లబోసింది. మా పెద్దవాడి పుటకలకి అందరూ ఆ ముసలిదాన్ని ముందుకు తోసి, ఆ మాట కాస్తా అనిపించారు. ఆ సంగతి నాకు తెలుసును. ఆపాళన నేను ఆ మెమీద విరుచుకుపడ్డాను. ఝుంయ్ ఝుంయ్‌మని ఎవరూ నోరెత్తకుండా పట్టుకు దులిపి దులిపి వదలిపెట్టాను. కుక్కిన పేనుల్లాగా ఎవరిమానాన వారు తప్పుకున్నారు.

'చెప్పిచెప్పి తగులుకుపోయిందని శాస్త్రం ఉందిలెండి వెనుకటికి : నా తప్పేమీ లేదు. అప్పుడు అలా అనుకునే ఆ పెళ్ళికి ఒప్పుకున్నాను. అక్కయ్య ఎందుకు లేచిపోయిందో అందరికీ తెలుసును : దానిమీద ఎవరూ జాలిదలచరేం ?

నిజంగా అది నాకన్న నిష్కల్మషమైన మనసుది. మొదటనే తగినవాడిని చూసిచేస్తే వంచినతల ఎత్తకుండా దాని కాపురం అది చేసుకుంటూ బ్రతికేది. అలాకాదని ఆస్తికోసం ఆశపడి, ఈ అర్జనుడికి దాన్ని అంటగడితే ఏలా తెల్లవారను? మొగుడంటూ ఉండీ ఒకటీ, లేకా ఒకటీ అయితే, నగా - నాణెం చూసుకుంటే కడుపు నిండుతుందా? ఎందుకు మళ్లా కన్న తల్లీ, తండ్రిని? చాటూ మాటూ అంటూ దానికి సరిపడదు. అందుకని మనసుకు వచ్చినవానితో ఢంకామీద దెబ్బతీసి లేచిపోయింది... ఇక్కడనుంచి లేచిపోయింది. అక్కడ అదీ, ఆతడూ సుఖంగా ఓ యింటివాళ్లై చిలకాగోరింకల్లాగా చూడ ముచ్చటగా ఉన్నారు.

'అక్కయ్యే కాదు. ఎవతె మా ఆయన్ను చేసుకున్నా ఆ పని చేయవలసిందే. అంతకన్న మరోదారి ఏముంది? ఆయన పుణ్యంకొద్దీ ఒకవేళ నేనుగాక ఆయన బాగానే ఏ పోడిమీ లేనిదానికి పుస్తె కడితే అప్పుడు యిద్దరూ తలో మూలా పడిఉండి కొంగజపం చేస్తూండేవాళ్లు. అయినా అలాంటి పెళ్ళి?...అసలు ఆయనకు పెళ్ళి ఎందుకు?...

'అందుకనే మావాళ్ళు, మా ఆదుర్దాపడ్డారు మొదటిలో; ఏవేళప్పుడు యిల్లు నాలుగుమూలలూ చక్కబెట్టుకుని ఎవడినో తీసుకు ఎప్పుడో అప్పుడు పుట్టి ముంచుతాననుకుని నిమిషం ఏమారకుండా ఎంతమంది నాకు కాపలా! నే నేం అంత తెలివి తక్కువదాన్నా! వీళ్ళకు అసలు నా మనసులో ఉన్నదేమో అంతుచిక్కనిస్తానా?

'నే నెందుకు లేచిపోవాలి? నాకు యిక్కడ ఏంలోపం? ఇవన్నీ విడిచి ఏ దేశాలో పట్టిపోతే యింత వైభవం ఉండేదా ? యిల్లు నాది. ఇంటి ఆయన నావాడు. ఇక్కడ ఉంటే నాయిష్టం వచ్చినట్లుంటాను. ఇల్లన్న తరువాత మరి పిల్లా, మేకా ఏమీ లోటులేకుండా ఎవరో ఒకరు చూచుకుపోవాలిగద. ఆయన కడుపులో చల్ల కదలకుండా అంతశ్రమా నేనేపడి ఆయన వంశం నిలవబెడుతున్నాను. నిజంగా మావాళ్ళకే ఆ యింగితం ఉంటే రోజూ దీపం పెట్టేవేళకు నాకు చెయ్యెత్తి దణ్ణంపెట్టాలి.

'అక్కయ్య బ్రతుకలా పాడుచేశారనే కచ్చకొద్దీ కాదు నే నిలాచేయడం. అందరికీ బుద్ధులు చెప్పే అంతటిదాన్నా నేను ? నన్ను చూసి ఎవరన్నా బాగుపడితే...నాలాటివాళ్లు, నాకు అదేపదవేలు. 'ఆమె పట్టిననోము లోకమంతా పట్టింది' అన్నట్టు వ్రతమూ చెడదు...ఫలం ఎప్పుడూ దక్కుతుంది.

'ఇంతా విన్నారుగదా ? యిప్పుడు చెప్పండి జవాబు' నేను అడిగినదానికి - ఎందుకు లేచిపోవాలి? అవతలవాడు ఇంద్రుడైనా, చంద్రుడైనా సరే పోయి అవతల యింతకన్న బావుకునే దేముంది. మీమీద కోపం లేదు. మీరేదో లోకరివాజు ప్రకారం అనుకున్నారు. అన్నీ ఉన్నదానికి మన అదృష్టం కొద్దీ అంటసా అయినాముకదా. అది అంతా మన చేతిలోది : ఎలా ఆడిస్తే అలా ఆడుతుంది. తప్పకుండా వెంటాడుతుంది. మనల్ని చూడగానే కీలుబొమ్మయి పోయింది. సొమ్మంతా కట్టుకుని...రమ్మనకముందే రానీకపోతే విడిచి

బ్రతుకలేనని బ్రతిమాలుకుంది. మనమే ఆ మాటలన్నీ అంటే, దానికి మమత మరీ చెలరేగి కన్నూ మిన్నూ తెలియక...

కాదనకండి. అన్నా నేను నమ్మను. కోరి, ఒక్కసారి కూడితే, వారు వీరవుతారని సామెతలేదూ? నాకు తెలియవూ మీ వగలన్నీ? నాచేత ఛల్ మోహానరంగా అనిపిద్దామనుకున్నారు. అనేదే నా అంతటి రాలుగాయకాని దేవతే అయినా. మన్మథుని మించిన సరసుడు మనసిచ్చినందుకు మాట దక్కించుకోవాలంటే ముందు, మాట దక్కించుకో వద్దూ. అవునండీ, నేనే యింతటి ఆసామీ భార్యనుకాక ఏ కూలినాలి బికారీనో అయితే నజరుగాఉండి, నచ్చితే పిలిచో, పిలిపించుకునో...అందుకు మీకు తోచిన విలువ యిచ్చి తొలగమనేవారు. మెడను కట్టుకు ఊళ్ళవెంట ఊరేగేవారా? అది లాభసాటిబేరం కాదు. ఇది అయితే మీకు మరియాద. ఊరిమీదకు పోయిన ఉద్యోగి ఉత్తచేతులతో తిరిగిరాకుండా కొత్త పిట్ట నోదాన్ని పట్టుకు వచ్చాడంటే వీరెంత ఘనులని ... నలుగురిలో మీ కెంత మరియాద!

'అన్నీ తెలుసును. ఔననండి, కాదనండి. మా బాగా మెను. అందరికన్నా, మీ రేం కొండదిగీ రాలేదు. దిగివచ్చినా ఇంతకుమించి వచ్చేదీ లేదు.

'ఇది మీకు కొత్త. నాకు కాదు. అందుకూ అలుకమేనా? అవును మరి. మీరే, నేను మొదాటకోరిన వారైతే మీ మగసిరి కెంతటి బిగువు? పతివ్రతను పాడు చేసిన గౌరవం, వెనుకనే యెవరో తన్నుకుపోయిరి' మీకు

దక్కకుండా. అప్పుడు అయినా రాకపోతిరి. పోనీ, అయినా...ఆ కొత్తమోజులోనైనా యింతే. నేను మీతో లేచివచ్చేదా న్ననుకున్నారా? ఎన్నటికీ...ఊహుఁ.

'ఎవరూ నాతో యింత నాటకమాడలేదండీ? ఏదో రావడం, ఆవేళకు నాతో అలసిసొలసినందుకు అదే పదివేలను కుంటూ, అలా ఎవరికోసోవను వారు అతిఆశకుపోకుండా అడపా దడపా...అదైనా యిందుకోసమని కాకుండా ఏదో మళ్ళా అల్లా కలసివచ్చినప్పుడు ఎప్పుడైనా...

'ఆలా ఉంటే కలకాలమూ మనసులో నిలిచిపోతారు. కలిసి ఉంటే మూడోనాటికి మొగం మొత్తదూ?

'మా పాప తండ్రి ... మా హేమను కన్నవారు, వారిద్దరూ...మీరు తీసిపోయినవారు కారు. మీ ఛాయా లోనే మీలాగే వచ్చారు. వచ్చినందుకు దైవం తలచినటు లుగా వరాలిచ్చారు. అదీ ముచ్చట...

'మరి యీసారి పురుడు పోసుకున్న తరువాత, పేరేం పెట్టమంటారు? బారసాల చేసుకునేనాటికి కబురు పంపుతాను. ఎంతతీరని తొందరపనులున్నా మీరు వస్తారు కాదూ? బదిలీ కాకుండా మావాడనే యేలుతూంటే?...

'కథ వింటేనే కడుపునిండుతుందా అని, మళ్లా అందు కోసం మారాంచేసినా అంతే. ఇకచాలు.

"నాది కడుపునిండినబేరం. ఎందుకు అలా నేను ఎవరితోనై తేమాత్రం లేచిపోవాలి? నాకు యింతకన్న ఏం కావాలి?"

మెలకువ తెప్పించి నన్నింత చులకనచేసింది కాని యింకా యెన్నడోగాని యెన్నటికైనా యేమో రానికాలం... కథలో గడపకుండా కల గననిచ్చినా కొంతమేలే! కాని ఆమె మాటలన్నీ నిజంగా నిజమనేగా...నాకు చేతగానితనానికి కోపం. అందుకు నన్ను నే నేమనుకోవాలి ?